సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : సామాజిక మాధ్యమాల వినియోగంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ తెలిపారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, రాచపూడినాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి ఆర్.వి.సాయికృష్ణ, ఏఎస్ఓ బాలఓబులేసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

మైదుకూరు : ఆడ పిల్లలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ అహల్యాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

ప్రొద్దుటూరు క్రైం : మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఎన్జీఓ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆర్.జయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ ఆటల పోటీలను ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి ప్రారంభించారు.

అనంతపురం కందులు బెటర్

ప్రొద్దుటూరు : స్టేట్ వేర్ హౌస్ గోడౌన్‌కు వచ్చిన కందుల నాణ్యత బాగుండటంతో అధికారులు బస్తాలను అన్‌లోడ్ చేసుకున్నారు. అనంతపురం జిల్లాకు సంబంధించి వచ్చిన బస్తాల్లో బుధవారం ఒక్క రోజే 4,454 కందుల బస్తాలను గోడౌన్‌లో నిల్వ ఉంచగా, 378 బస్తాలను మాత్రమే నాణ్యత లేదని వెనక్కి పంపారు. సత్యసాయి జిల్లా రొద్దం ప్రాంతం నుంచి వచ్చిన కందుల నాణ్యత సరిగా లేదని, మంగళవారం పెద్ద సంఖ్యలో కందుల బస్తాలను వెనక్కి పంపిన విషయం తెలిసిందే.

పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో పేకాట ఆడుతున్న మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 11 మందిని ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్యాణ మండపంలో పెద్ద ఎత్తున పేకాట జరుగుతోందని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో అల్లుట్ల రమణ, జగన్నాథంతో పాటు మరో 9 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1.18 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు.

చంద్రబాబు చొక్కా పట్టుకొని నిలదీస్తారు

మైదుకూరు : ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న చంద్రబాబును రాబోవు రోజుల్లో ప్రజలు చొక్కా పట్టుకుని నిలదీస్తారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ కమిటీల కార్యవర్గం ఏర్పాటుపై నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాగద్వేషాలు లేకుండా పదవిని నిర్వహిస్తామని ప్రమాణం చేసి, ఇటీవల గంగాధర నెల్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ పనులు చేయకూడదని చంద్రబాబు చెప్పడం శోచనీయమన్నారు. టీడీపీ కార్యకర్తలు ఓట్లు వేస్తేనే చంద్రబాబు గెలిచారా అని ప్రశ్నించారు. ఓట్లు వేసిన వారు ప్రజలు కాదా అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ విధంగా మాట్లాడటం రాజ్యాంగ ఉల్లంఘన కాదా అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు తీసేస్తారనో.. కేసులు పెడతారోనని భయపడుతుండొచ్చు కానీ, సమయం వచ్చినప్పుడు చొక్కా పట్టుకుని తీరుతారని అన్నారు. నిన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచి కౌంట్ డౌన్ మొదలైందని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో 64 శాతం ఓట్లు రాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 శాతానికి పడిపోయిన విషయం చంద్రబాబు తెలుసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

హిట్లర్‌లా వ్యవహరిస్తే చంద్రబాబు గెలవడు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడమే పాలనగా మారిందని రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై 15–20 కేసులు పెడుతున్నారని.. ఇదేనా పాలన అని ప్రశ్నించారు. పోసానిపై 15 కేసులు పెట్టారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ వారు ఎన్నో మాటలు అన్నారని, వేల వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో చర్యలు తీసుకుని ఉంటే వారు తిరిగేవారా అని ప్రశ్నించారు. హిట్లర్, ముస్సోలినీ లాగా వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో టీడీపీకి, కూటమి పార్టీలకు బిగ్ జీరో సీట్లు వస్తాయి చంద్రబాబు కూడా గెలవలేడని అన్నారు.

అప్పు తెచ్చిన సొమ్ముపై శ్వేత పత్రం ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం ఈ పది నెలల్లో రూ.లక్షా 34వేల కోట్ల అప్పు చేసిందని ఆ సొమ్మంతా దేనికి ఖర్చు చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు కంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్కువ అప్పు చేసినా మేనిఫెస్టోలో ఏం చెప్పారో 98 శాతం అమలు చేసిన ఘనత ఆయనదే అన్నారు.

రైతులు సంతోషంగా లేరు

కూటమి ప్రభుత్వంలో రైతులు సంతోషంగా లేరని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. అదే జగన్ ప్రభుత్వంలో ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించినట్లు తెలిపారు. కేపీ ఉల్లికి ధర లేకపోతే రూ.5వేలు ఇచ్చి కొనుగోలు చేసి ఆదుకున్నట్లు తెలిపారు. పసుపు పంటకు రూ.6,500 ధర ఇచ్చి కొనుగోలు చేశామన్నారు. ఏటా రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క రైతుకైనా ఒక్క రూపాయి వచ్చిందా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మైనార్టీ నేత మదీనా దస్తగిరి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, చేనేత, వాణిజ్య, బీసీ సెల్ తదితర విభాగా జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజనీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపాలిటీలోని ఆయా విభాగాల సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైపులైను లీకేజీలు, మరమ్మతులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే పట్టణంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ సిబ్బంది తప్పనిసరిగా పర్యవేక్షించాలని, అలాగే నాణ్యత లోపించకుండా చూడాలని కోరారు. వివిధ రకాల పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి, సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈఈ సుమన్‌రెడ్డి, మేనేజర్ సుధీర్, ఏఈలు మహేష్, బాబు, ఆయా సచివాలయాల అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాట తప్పడం చంద్రబాబు నైజం: ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : మోసం, నమ్మకద్రోహం, మాట తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు విధానాలను ఆయన తప్పుపట్టారు. పేదలపై ప్రేమ, చిత్తశుద్ధి, సంక్షేమంపై ఆచరణ చేయాలన్న కోరిక ఉంటే సూపర్‌సిక్స్ అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించే వారన్నారు. 9 నెలల కాలంలో ప్రజలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. పింఛన్ల ప్రచార ఆర్భాటం తప్ప ఏమీ లేదన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. అన్యాయం జరిగితే సహించబోమన్నారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందరరామిరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సుకు పెండ్యాల కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు, రాజీవ్ రత్న అవార్డు గ్రహీత పెండ్యాల రామ్మోహన్ రావు ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రతకు, శ్రేయస్సుకు విశేష కృషి చేశారని యూనియన్ నాయకులు తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోఆవరణలో పెండ్యాల రామ్మోహన్‌రావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్‌కమిటీ మెంబర్ వి.రామకృష్ణయ్య, రీజనల్ కమిటీ మెంబర్ సూర్యనారాయణ, డిపోఅధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జె.బాబయ్య, అయ్యవారప్ప, డిపోట్రెజరర్ వై.బాబు, డిపోకార్యదర్శి ఆశోక్, గ్యారేజిఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. విజయవాడలో బుధవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, పృథ్వీనారాయణ కలిశారు. తమ కళాశాలకు న్యాక్ బీ ప్లస్ ప్లస్, అటానమస్ హోదా వచ్చిందని మంత్రికి వారు వివరించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను మంత్రి చేతుల మీదుగా వారు అందుకున్నారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ శుభాభినందనలు తెలిపారు.


మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, పృథ్వీ

700 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో బుధవారం 700 బస్తాల రేషన్ బియ్యం లోడుతో వెళుతున్న లారీని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం లోడుతో వెళుతున్న లారీ మైదుకూరు నుండి చెన్నై వెళుతుండగా ముందస్తు సమాచారం మేరకు పట్టుకున్నట్లు రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. లారీలో దాదాపు 700 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా మైదుకూరుకు చెందిన సూరిశెట్టి ప్రసాద్‌కు చెందిన రేషన్ బియ్యంగా అధికారులు గుర్తించినట్లు సమాచారం.



దంత సంరక్షణపై అవగాహన అవసరం



ప్రొద్దుటూరు : దంత సంరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. కనీస అవగాహన లేని కారణంగా మనిషి జీవిత కాలంలో త్వరగా పళ్లు దెబ్బతింటున్నాయి. తద్వారా మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. వ్యక్తిగత శుభ్రతలో దంతాల ఆరోగ్యం చాలా ముఖ్యం. నోటి శుభ్రతను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇన్‌ఫెక్టివ్ ఎండోకార్డిటిస్, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు గుండె సమస్యలపై ప్రభావం చూపే అవకాశం ఉందని దంత వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దంతాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం వల్ల పుచ్చు ఏర్పడే అవకాశం ఉంది. ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు చేర్చడంతో నోటి ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. దంత సంరక్షణకు సంబంధించి కొన్ని చిట్కాలను పాటించాల్సిన అవసరం ఉంది. ప్రతి 6–8 నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవాలి. చక్కెర అధికంగా ఉండే ఆహారాలు, పానీయాల వినియోగాన్ని తగ్గించాలి. రోజుకు కనీసం రెండు సార్లు బ్రెష్ చేయడం, నాలికను శుభ్రం చేసుకోవడం అవసరం. ఆయుర్వేద లేదా రసాయన రహిత టూత్‌పేస్టలను ఉపయోగించాలి. ప్రతి మూడు నెలలకు మనం వినియోగించే టూత్ బ్రెష్‌ను మార్చాలని వైద్యులు సూచిస్తున్నారు. బఠాని గింజ అంత పరిమాణంలో టూత్ పేస్ట్‌ను వినియోగించాలని, ఎక్కువ టూత్‌పేస్ట్ వాడటం వల్ల దంతాలు దెబ్బతినే అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు. ప్రతి భోజనం తర్వాత నోరు శుభ్రం చేసుకోవాలి. లేకపోతే ఆహారం దంతాల మధ్య ఇరుక్కుపోయి బ్యాక్టీరియా పెరగడానికి కారణమవుతుంది. పొగాకు, సిగరెట్లకు దూరంగా ఉండాలి. దంత పరిశుభ్రతలో ఆరోగ్యకరమైన ఆహారం చాలా ముఖ్యం. నోటి నుండి ఆహార అవశేషాలను తొలగించడానికి మౌత్ వాష్‌ను ఉపయోగించవచ్చు.





















గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బైపాస్ రోడ్డు పక్కన ఉన్న సాయిశ్రీ లే అవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో టూటౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం దాడులు చేశారు. దాడిలో షేక్ ఖాజాపీర్, పల్లె ప్రశాంత రావు, తలారి మైఖేల్ బాబులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి, రూ.13వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ప్రశాంతరావు, మైఖేల్‌లపై గతంలో పలు మట్కా, గంజాయి కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని విద్యానగర్ వద్ద ఓ ఇంటి ముందు ఉంచిన బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన యర్రగొల్ల శివరామకృష్ణయాదవ్ మంగళవారం రాత్రి రోజూ మాదిరే ద్విచక్ర వాహనాన్ని తన ఇంటి ముందు ఉంచాడు. ఉదయం లేచి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

చాపాడు : ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10గంటలకు దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్, తహసీల్దారు, పోలీసులు సమక్షంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ తెలిపారు.

